

జేఎన్‌టీయూహెచ్‌లో ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ బాలకిష్టారెడ్డి



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో వీసీ బాలకృష్ణారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు



# రాష్ట్రాల వర్సిటీలపై కేంద్రం ఆధిపత్యమా!

డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## వర్సిటీలపై కేంద్రం పెత్తనం సహించం

# యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలి

- వర్సిటీలపై కేంద్రం పెత్తనాన్ని సహించం
- పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం
- ప్రధానికి లేఖ రాస్తా: సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్ రిసోర్స్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎసెన్షియల్ స్టాఫ్ క్వార్టర్లకు శంకుస్థాపన చేశారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు పథకాల అమలు సందర్భంగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... దేశంలో మళ్లీ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలనే చర్చ జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి దిశను అందించాల్సిన బాధ్యత యూనివర్సిటీ వీసీలపై ఉన్నదని స్పష్టం చేశారు. పదేండ్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, అమలు చేసే బాధ్యత తాము తీసుకుంటామని వీసీలకు సూచించారు. యూనివర్సిటీల ప్రైవేటీకరణ ఆలోచన మంచిది కాదని హితవు పలికారు. యూజీసీ నిబంధనల్లో మార్పులు చేసి, రాష్ట్రాల పరిధి నుంచి వాటిని తప్పించి.. యూనివర్సిటీలపై పెత్తనం చెలాయించాలని కేంద్రం కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తమ హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా కేంద్రం గుంజుకుంటే.. రాష్ట్రాలు కేవలం పన్నులు వసూలు చేసే సంస్థలుగా మిగిలిపోతాయని పేర్కొన్నారు.

### పద్మ అవార్డుల్లో అన్యాయం

పద్మ అవార్డుల విషయంలోనూ కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందని సీఎం మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమల రావు లాంటి వారిని గుర్తించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ప్రధానికి ఈ విషయంపై లేఖ రాయనున్నట్టు వెల్లడించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా రాష్ట్రంలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తూ అండగా నిలబడ్డ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు 65 ఏండ్లు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్రంలో 11 వర్సిటీల్లో 2,817 టీచింగ్ పోస్టులకు ప్రస్తుతం 757 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే విషయాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పేర్కొన్నది. 6-7 వర్సిటీల్లో ఒక్కరంటే ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. రిక్రూట్‌మెంట్ విధానంపై ప్రభుత్వం ఇంత వరకు ఏదీ తేల్చలేదు. నెల నెలా కొందరు ప్రొఫెసర్లు రిటైర్మెంట్ అవుతున్నారు.

# 'సెట్' చేసుకోండిలా



